# వాతావరణం.. గందరగోళం!

- లానినా కొనసాగుతున్నా.. భిన్నమైన పరిస్థితులు
- ఫిబ్రవరిలోనే రికార్డు స్థాయిలో భానుడి భగభగలు
- 124 ఏండ్లలోనే అత్యధికమంటూ ఐఎండీ రిపోర్ట్
- వానకాలంలో కురిసే వర్షపాతంపైనా అనుమానాలు
- నిరుడి కంటే ఈసారి వానలు తక్కువేనన్న నిపుణులు
- గ్లోబల్ వార్మింగ్ వల్లే లానినాలో మార్పులని వెల్లడి



సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ)/(స్పెషల్ టాస్క్ బ్యూరో): పొద్దుగాల తొమ్మిదింటికి బయటకెళ్లినా మాడు భగ్గుమంటున్నది. సాయంత్రమైనా భూమి సెగలు పొగలు కక్కుతున్నది. మే నెల వచ్చిందా? అని చూస్తే, క్యాలెండర్ మార్చి కూడా దాటలే. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల పరిస్థితి ఇలా ఉంది. భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. మార్చి మొదటి నుంచే 35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే ఆస్కారం ఉందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం లానినా పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతుండటంపై నిపుణులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే వర్షాకాలంలో సమృద్ధి వానలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా వాతావరణంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నట్టు చెప్తున్నారు.

**ఏమిటీ.. ఎల్‌నినో? లానినా?**

వాతావరణంలో సంభవించే పరస్పర విరుద్ధ పరిణామాలనే ఎల్‌నినో, లానినాగా చెప్తారు. పసిఫిక్ మహా సముద్రం మధ్య, తూర్పు ప్రాంత ఉపరితలంలో ఏర్పడే ప్రత్యేక సముద్ర పవనాలు సాధారణంగా ఎల్‌నినో, లానినాకు కారణంగా పరిణమిస్తాయి. ఈ రెండింటినీ కలిపి 'ఎల్‌నినో సదరన్ ఆసిలేషన్ (ఈఎన్ఎస్‌వో)' వలయాలుగా పిలుస్తారు. ఈఎన్ఎస్‌వోలో ఉష్ణ దశను ఎల్‌నినో అని, చలి దశను లానినాగా పేర్కొంటారు. సాధారణ పరిభాషలో చెప్పాలంటే.. ఎల్‌నినో కారణంగా ఎండలు మండిపోతాయి. వర్షాలు తక్కువగా కురుస్తాయి. లానినా కారణంగా మంచి వానలు కురుస్తాయి. మన దేశంలో 70 శాతం వానలకు కారణమయ్యే నైరుతి రుతుపవనాలను కూడా ఈ ఎల్‌నినో, లానినాలే ప్రభావితం చేస్తాయి.

**భిన్నమైన పరిస్థితులు**

పసిఫిక్ మహాసముద్ర జలాల్లో ఏర్పడే ఈఎన్ఎస్‌వో వలయాలు ప్రతీ రెండు, మూడేండ్లకు ఒకసారి మారుతాయి. అంటే, ఒకసారి లానినా పరిస్థితులు ఉంటే, ఆ వచ్చే ఒకట్రెండేండ్లూ లానినానే ఉండి మంచి వర్షాలు కురుస్తాయి. ఎండల తీవ్రత తక్కువగా ఉంటుంది. అయితే, ఇందుకు భిన్నమైన పరిస్థితులు ప్రస్తుతం నమోదవుతున్నాయి. నిరుడు లానినా సైకిల్ మొదలైంది. అందుకే గత వానకాలం సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురిశాయి. ఈ లెక్కప్రకారం లానినా ప్రభావం ఈసారి కూడా ఉండాలి. అంటే ఈసారి ఎండల తీవ్రత తక్కువగా నమోదవ్వాలి. అయితే అందుకు భిన్నంగా భానుడు ఫిబ్రవరి నుంచే నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు.

**వానలు తక్కువే**

ప్రస్తుతం కొనసాగుతున్న లానినా పరిస్థితులు క్రమంగా బలహీనపడుతున్నట్టు ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) పేర్కొంది. మార్చి నుంచి మే నెల నాటికి లానినా ప్రభావం తగ్గి తటస్థ పరిస్థితులు ఏర్పడే అవకాశం 60 శాతం మేర ఉండనున్నట్టు అంచనా వేసింది. ఏప్రిల్-జూన్ నాటికి ఇది 70 శాతానికి పెరుగనున్నట్టు తెలిపింది. ఇదే సమయంలో ఎల్‌నినో పరిస్థితులు కొంతమేర పుంజుకోవచ్చని అభిప్రాయపడింది. ఫలితంగా మే చివరినాటికి లానినా ప్రభావం చాలావరకూ తగ్గిపోనున్నట్టు వివరించింది. కాగా, లానినా ప్రభావం తగ్గుతుండటం, ఎల్‌నినో పుంజుకొనే అవకాశాలు పెరుగుతుండటంతో వచ్చే నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సాధారణం లేదా అంతకంటే తక్కువ వర్షపాతమే నమోదయ్యే అవకాశం ఉన్నదని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### వానలు తక్కువే!

ప్రస్తుతం లానినా తటస్థంగా ఉంది. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మే తరువాత ఎల్‌నినో వచ్చి చేరొచ్చు. గతంలో రెండు మూడేండ్లకోసారి వానలతో పాటు ఆ దఫా తరువాత కరువు కూడా సంభవించేది. ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ ప్రభావం వల్ల అధిక వానలు, అధిక వరదలు క్రమంగా రావడం జరుగుతోంది. లేదంటే క్రమంగా కరువు ముంచుకొస్తున్నది. నిరుడు వానలు కురిసినందు వల్ల 2025లో అనుకున్న స్థాయిలో వానలు పడకున్నా పెద్దగా నష్టమైతే లేకపోవచ్చు.

– సాయి ప్రణీత్, వెదర్‌మ్యాన్

### సాధారణ వానలే

వచ్చే జూన్-సెప్టెంబర్ మాసంలో ఎల్‌నినో ప్రభావం ఉండనున్నట్టు డబ్ల్యూఎంవో అంచనాలను బట్టి అర్థమవుతున్నది. దీంతో దేశంలో సమృద్ధి వర్షపాతం కాకుండా సాధారణ వర్షాలే పడే అవకాశమున్నట్టు తెలుస్తున్నది.

– మహేశ్ పలావత్, స్కైమెట్ వెదర్ కంపెనీ శాస్త్రవేత్త

### అందుకే మార్పులు

గ్లోబల్ వార్మింగ్ కారణంగా వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకొంటున్నాయి. భూతాపం వల్ల ఎల్‌నినో, లానినా సైకిల్ కూడా మారుతున్నది. ప్రస్తుతం వాతావరణంలో కనిపిస్తున్న భిన్నమైన మార్పులకు ఇదే కారణమని భావించొచ్చు.

–శివానంద పాయి, ఐఎండీ శాస్త్రవేత్త

### రాత్రిళ్లు ఉక్కపోత అందుకే

జనాభా పెరగడం, పశుషోషణ తగ్గడం, చెరువులను పాతం పెట్టడం, గాలి, నీరు కలుషితమవడం వల్లనే రాత్రి వేళ ఉక్కబోత.

–ధర్మరాజు, వాతావరణ అధికారి.

### గ్లోబల్ వార్మింగ్ వల్లే

ప్రస్తుతం లానినా ప్రభావం ఉన్నప్పటికీ, మొన్నటి ఫిబ్రవరి నెలలో.. 124 ఏండ్లలో ఎన్నడూ చూడనిస్థాయిలో ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) తెలిపింది. లానినా ప్రభావం క్రమంగా బలహీన పడుతుండటంతోనే ఫిబ్రవరిలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని నిపుణులు చెప్తున్నారు. రానున్న రోజుల్లో లానినా పరిస్థితులు మరింత బలహీనపడే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే మేలో భానుడి భగభగలు మరింతగా పెరుగుతాయి. వానకాలంలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగానే వాతావరణంలో ఈ ఊహించని పరిణామాలు చోటుచేసుకొంటున్నాయని, ఎల్‌నినో, లానినా సైకిల్‌లో తేడాలకు కూడా ఇదే ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## కాంగ్రెస్‌లో స్లీపర్ సెల్స్

- పార్టీలో ఉంటూ బీజేపీకి పనిచేస్తున్నారు
- అలాంటి వారందరినీ ఫిల్టర్ చేయాలి
- అవసరమైతే 30-40 మందికి ఉద్వాసన
- రాహుల్ గాంధీ హెచ్చరిక
- సొంత పార్టీపైనే ట్రోలింగ్ చేస్తున్నారని బీజేపీ ఎద్దేవా
- ఆయనే తమ అతిపెద్ద ఆస్తి అని వ్యాఖ్య



న్యూఢిల్లీ, మార్చి 8: కాంగ్రెస్‌లో ఉంటూ కొందరు బీజేపీ కోసం పనిచేస్తున్నారని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీని ప్రక్షాళన చేసే క్రమంలో అవసరమైతే స్లీపర్ సెల్స్‌గా వ్యవహరిస్తున్న 30-40 మందిని పార్టీ నుంచి తొలగించడానికి సిద్ధమేనని అన్నారు. రాహుల్ హెచ్చరికలను బీజేపీ ఎద్దేవా చేసింది. పార్టీకి పెద్ద ఆస్తి లాంటి సొంత పార్టీ నేతలనే ఆయన తప్పుబట్టారని, వాస్తవానికి 'బీజేపీకి రాహులే అతిపెద్ద ఆస్తి' అని పేర్కొంది. పార్టీలో రెండు రకాల నాయకులు ఉన్నారని, వారిలో కొందరు నిత్యం ప్రజలతో నిజాయితీగా మమేకం అయి ఉంటుండగా, మరికొందరు ప్రజలకు దూరంగా ఉంటున్నారని రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజలకు దగ్గర అవ్వాలంటే ఆ రెండు గ్రూపులను విడదీయాల్సి ఉందని, ప్రజల కోసం పనిచేయని వారిని సాగనంపాల్సి ఉందని ఆయన చెప్పారు. 'ఎవరైతే కాంగ్రెస్‌లో ఉంటూ రహస్యంగా బీజేపీకి పనిచేస్తున్నారో వారంతా బయటకు రావాలి' అని రాహుల్ పేర్కొన్నారు. 30 ఏండ్లుగా గుజరాత్‌లో అధికారంలో లేని కాంగ్రెస్ పలు సవాళ్లను ఎదుర్కొంటున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. కేవలం ఎన్నికల మీద మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తే ప్రజల విశ్వాసాన్ని పొందలేమని అన్నారు. మన బాధ్యతలు నెరవేర్చే వరకు గుజరాత్ ప్రజలు మనల్ని ఎన్నుకోరని, మొదట మనం ప్రజల నమ్మకాన్ని చూరగొనాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ప్రస్తావిస్తూ రాహుల్ బీజేపీకి పెద్ద ఆస్తి అని వ్యాఖ్యానించారు.

## విదేశీ యాత్రలు మరింత ప్రియం

- భారీగా పెరిగిన ప్యాకేజీల ధరలు
- రూపాయి పతనమే కారణం

న్యూఢిల్లీ, మార్చి 8: రూపాయి మారకం విలువ క్రమంగా తగ్గుతుండటంతో టూర్ ఆపరేటర్లు తమ ప్యాకేజీల ధరలను పెంచి ఆ భారాన్ని పర్యాటకులపై మోపుతున్నారు. దీంతో విహారయాత్రల ఖర్చులు నానాటికీ పెరుగుతున్నాయి. అలా నిరుటితో పోలిస్తే ఈసారి ఏప్రిల్-జూన్‌లో అంతర్జాతీయ పర్యాటక ప్యాకేజీల ధరలు 15 నుంచి 25% మేరకు పెరిగాయి. 2017-18 తర్వాత ఇదే అత్యధిక పెరుగుదల. దీనికితోడు హోటల్ ధరలు కూడా పెరిగినందున విదేశీ విహారానికయ్యే మొత్తం ఖర్చు మరింత పెరగనున్నది. ఖర్చులు ఎంత పెరిగినప్పటికీ చాలా మంది భారతీయులు తమ సెలవులను గడిపేందుకు సుదూర ప్రాంతాల్లోని గమ్యస్థానాల వైపు చూస్తుండటంతో ప్రయాణానికి డిమాండ్ అధికంగానే ఉంది. భారత్‌లోని హిల్ స్టేషన్లకు పర్యాటకుల తాకిడి అధికమై హోటల్, విమాన చార్జీలు పెరగడంతో చాలా మంది విదేశీ పర్యాటక గమ్యస్థానాల వైపు చూస్తున్నారు. డాలర్ విలువ అధికంగా ఉండటం వల్ల పర్యాటక ఖర్చులు పెరిగినప్పటికీ ఉచితంగా ఈ-వీసాలు ఇస్తామని చాలా దేశాలు ప్రకటించడంతో అంతర్జాతీయ టూర్ ప్యాకేజీలకు డిమాండ్ మరింత అధికమైంది.

**దేశంలో అయోధ్య, లక్షద్వీప్, నంది హిల్స్ టాప్**

నిరుడు భారత్‌లో పర్యాటకులకు అయోధ్య, లక్షద్వీప్, నంది హిల్స్ ప్రధాన గమ్యస్థానాలుగా నిలవడంతో ఈ వేసవిలో ఎంతో మంది ఆ ప్రాంతాల వివరాల కోసం శోధిస్తున్నారు. వీటితో పాటు గోవా అత్యధికంగా శోధించిన ప్రాంతంగా నిలిచినట్టు వేసవి పర్యాటక ధోరణులపై తాజాగా విడుదలైన సమాచారం స్పష్టం చేస్తోంది.

## పెనుగొండ లక్ష్మీనారాయణకు సాహిత్య అకాడమీ అవార్డు ప్రదానం

**మరో 22 మందికి కూడా**

న్యూఢిల్లీ, మార్చి 8: తెలుగు రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణ సహా 23 మంది రచయితలు, కవులు ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2024ను అందుకున్నారు. ఇక్కడ జరుగుతున్న సాహిత్యోత్సవంలో భాగంగా శనివారం ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ అవార్డు కింద విజేతలకు లక్ష రూపాయల నగదుతో పాటు పత్రం, శాలువను బహూకరించారు. నిరుడు డిసెంబర్‌లో ఈ అవార్డులను ప్రకటించారు. తెలుగులో పెనుగొండ లక్ష్మీనారాయణ రచించిన దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికి సాహిత్య విమర్శ విభాగంలో ఈ అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జన్మించిన పెనుగొండ లక్ష్మీనారాయణ వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ రచయితగా పేరొందారు. 1954లో చెరువుకొమ్ముపాలెం గ్రామంలో పుట్టిన ఈయన 1972 నుంచి రచనలు చేయడం ప్రారంభించారు. పలు పుస్తకాలకు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించడమే కాక, 100కు పైగా పుస్తకాలకు సహ-సంపాదకుడు, గౌరవ సంపాదకునిగా వ్యవహరించారు.

## కెనడా కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ?

టొరంటో: ట్రంప్ టారిఫ్‌ల మోతతో సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ ఆదివారం కెనడా కొత్త ప్రధాని ఎన్నిక జరుగనుంది. మాజీ బ్యాంకరైన మార్క్ కార్నీ కొత్త ప్రధానిగా నియమితులయ్యే అవకాశం ఉన్నది. అధికార లిబరల్ పార్టీ ఆదివారం సమావేశమై కొత్త ప్రధానిని ఎన్నుకోనున్నది. వరుస రాజకీయ సంక్షోభాల నేపథ్యంలో ప్రధాని పదవి నుంచి వైదొలుగుతున్నట్టు గత జనవరిలో జస్టిన్ ట్రూడో ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాతో సంబంధాలు చెడిన ప్రస్తుత తరుణంలో కొత్త ప్రధానికి పలు కీలక సవాళ్లు ఎదురుకానున్నాయి. ఈ ఏడాది చివరిలో కెనడా పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి.

## టారిఫ్‌ల తగ్గింపునకు భారత్ అంగీకారం

**ట్రంప్ ప్రకటన**

వాషింగ్టన్: అమెరికా ఉత్పత్తులపై విధిస్తున్న టారిఫ్‌లను తగ్గించేందుకు భారత దేశం అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం తెలిపారు. ఓవల్ ఆఫీసులో మీడియాతో ఆయన మాట్లాడుతూ, భారీగా టారిఫ్‌లను భారత్ విధిస్తున్నదని విమర్శించారు. వీటి వల్ల అమెరికన్ వ్యాపార సంస్థలకు తమ ఉత్పత్తులను భారతీయ మార్కెట్‌లో అమ్ముకోవడం కష్టంగా మారిందన్నారు. భారత్ చేస్తున్న దానిని బాహాటంగా ఎత్తి చూపడంతో ఎట్టకేలకు టారిఫ్‌లను తగ్గించడానికి అంగీకరించిందని చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు చర్చలను ముమ్మరం చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. టారిఫ్, నాన్ టారిఫ్ అడ్డంకులను తగ్గించడం లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకోవడానికి చర్చలు జరుగుతున్నాయి.

## 3డీ ప్రింటెడ్ పురుషాంగం!

**నపుంసకత్వానికి చెక్**

బీజింగ్, మార్చి 8: నపుంసకత్వం (ఎరెక్టైల్ డిస్‌ఫంక్షన్) సమస్యతో బాధపడుతున్న పురుషులకు శుభవార్త. ఎట్టకేలకు ఈ సమస్యకు శాస్త్రవేత్తలు శాశ్వత పరిష్కారాన్ని కనుగొన్నారు. గ్వాంగ్‌జౌలోని సౌత్ చైనా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు 3డీ ప్రింటెడ్ పురుషాంగ ఇంప్లాంట్‌ను అభివృద్ధి చేశారు. అంగస్తంభనలో కీలకంగా వ్యవహరించే కార్పస్ కెవర్నోసమ్ అనే కణజాలాన్ని వృద్ధి చేశారు. ఇది సుమారుగా 2.46 అంగుళాలు ఉంటుంది. అధ్యయనంలో భాగంగా ఈ 3డీ ప్రింటెడ్ ఇంప్లాంట్‌ను పదుల సంఖ్యలో పందులు, కుందేళ్లపై ప్రయోగించగా మెరుగైన ఫలితాలు వచ్చాయి. పురుషాంగ కణాలు దెబ్బతిన్న పందుల్లో అంగస్తంభన జరగడమే కాదు, సంతానోత్పత్తిలోనూ మెరుగైన ఫలితాలు కనిపించాయి. ఈ ఇంప్లాంట్‌ను అమర్చకముందు పందుల్లో సంతానోత్పత్తి రేటు 20 శాతం వరకు ఉండగా.. అమర్చాక 100 శాతానికి పెరిగింది.



## మళ్లీ భగ్గుమన్న మణిపూర్

- స్వేచ్ఛా సంచారానికి అనుమతించిన తొలి రోజే హింస
- భద్రతా దళాలతో కుకీ ఆందోళనకారుల ఘర్షణ
- ఒక నిరసనకారుడి మృతి.. 40 మందికి గాయాలు

ఇంఫాల్, మార్చి 8: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ హింస రాజుకుంది. ప్రజల స్వేచ్ఛా సంచారం ప్రారంభమైన తొలి రోజే ఘర్షణలు రేగాయి. కుకీల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న కాంగ్‌పోక్పి జిల్లాలో కుకీ నిరసనకారులు పలుచోట్ల భద్రతా దళాలతో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణల్లో ఒకరు మృతి చెందగా, 40 మంది గాయపడ్డారు. ఘర్షణల నేపథ్యంలో పోలీసుల సాయంతో ఆర్టీసీ బస్సులను నడపాల్సి వచ్చింది. కాంగ్‌పోక్పి జిల్లాలో కుకీ నిరసనకారులు రెండో నెంబర్ జాతీయ రహదారిని దిగ్బంధించి ప్రైవేట్ వాహనాలకు నిప్పు పెట్టారు. భద్రతా దళాలు వెనక్కి వెళ్లాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన ప్రజల స్వేచ్ఛా సంచారాన్ని వ్యతిరేకించారు. మైతీలకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ సివిల్ సొసైటీ వారి శాంతి ర్యాలీనీ నిరసనకారులు వ్యతిరేకించారు. పర్వత ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తున్న కుకీలు తమకు భూములపై హక్కులు కావాలని, రాజకీయ ప్రాతినిధ్యం కావాలని మే 2023 నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మైతీ గిరిజనులతో వారు ఘర్షణ పడుతున్నారు. ఈ కారణంగా జరిగిన హింసాకాండలో ఇప్పటి వరకు 250 మంది మృతి చెందారు. 50 వేల మంది స్వస్థలాలను విడిచిపెట్టారు.

**ఛావా ఎఫెక్ట్.. గుప్త నిధుల కోసం వేట**



శంభాజీ మహారాజ్ చరిత్రను తెలిపే సినిమా 'ఛావా' ప్రభావంతో మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌లో గుప్త నిధుల కోసం వేట జరుగుతున్నది. అసిర్‌గఢ్ కోటలో ఈ నిధులున్నాయని సినిమాలో చూపించడంతో స్థానికులు రాత్రి వేళల్లో టార్చిలైట్లు, మెటల్ డిటెక్టర్లు, జల్లెడలతో గుప్త నిధుల వేట కొనసాగిస్తున్నారు. కొందరు బంగారం, వెండి నాణేలు దొరికాయని చెప్తున్నారు.

## మనుమడి చితిలో దూకి తాతయ్య ఆత్మహత్య

**అంతకుముందు భార్యను హత్య చేసి మనుమడి బలవన్మరణం**

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లా, సిహోలియా గ్రామంలో మనుమడి చితిలో దూకి తాతయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. డీఎస్పీ గాయత్రి తివారీ కథనం ప్రకారం, అభయ్‌రాజ్ యాదవ్ (34) తన భార్య సవితను(30) శుక్రవారం హత్య చేశాడు. అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. అదే రోజు సాయంత్రం వీరిద్దరికీ అంత్యక్రియలు జరిగాయి. అభయ్ మృతితో ఆయన తాతయ్య రామావతార్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన తన మనుమడి చితిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు శనివారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది.

# కుమార్తెకు ప్రేమతో..

- మహిళా దినోత్సవాన కూతురికి శివ్‌నాడార్ భారీ బహుమతి
- హెచ్‌సీఎల్ టెక్, వామా సుందరి ఇన్వెస్ట్‌మెంట్‌లో 47% వాటా బదిలీ



న్యూఢిల్లీ, మార్చి 8: దేశంలో మూడో అతి పెద్ద టెక్నాలజీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీ ఫౌండర్ శివ్ నాడార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళా దినోత్సవం రోజే పలు సంస్థల్లో తనకున్న వాటాను తన గారాలపట్టి రోష్నీ నాడార్ మల్హోత్రాకు బదిలీ చేశారు. హెచ్‌సీఎల్ కంపెనీతోపాటు అనుబంధ సంస్థలైన వామ సుందరి ఇన్వెస్ట్‌మెంట్స్(ఢిల్లీ) ప్రైవేట్ లిమిటెడ్‌లోని తనకున్న మొత్తం వాటాలో 47 శాతం వాటాను రోష్నీకి బదిలీ చేస్తూ గిఫ్ట్ డీడ్‌లను అమలు చేశారు. ఇందుకు సంబంధించి ఈ నెల 6న బదిలీ చేశారు. ఈ బదిలీ అనంతరం ఈ రెండు సంస్థలకు రోష్నీ నాడార్ నాయకత్వం వహించనున్నారు. వామా ఢిల్లీ, హెచ్‌సీఎల్ కార్పొరేషన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీలో మెజార్టీ వాటాదారుడిగా రోష్నీ కొనసాగనున్నారు. ఈ బదిలీకి ముందు శివ్ నాడార్.. రోష్నీ నాడార్ మల్హోత్రాకు రెండు సంస్థల్లోనూ వరుసగా 51 శాతం, 10.33 శాతం వాటా కలిగివున్నారు. ఈ కేటాయింపుల అనంతరం హెచ్‌సీఎల్ కార్పొరేషన్, వీఎస్ఐపీఎల్‌లో రోష్నీ వాటాలు 57.33 శాతానికి పెరిగాయి. ఇదే సమయంలో శివ్ నాడార్ వాటా 4 శాతానికి పరిమితమయ్యాయి. గతంలో హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్‌లో హెచ్‌సీఎల్ కార్పొరేషన్‌కు 49.94 శాతం వాటా ఉండగా, వామా ఢిల్లీకి 12.94 శాతం వాటా ఉన్నది.

**సెబీ అనుమతి..**

స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఈ వాటా బదిలీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఓపెన్ ఆఫర్ ద్వారా షేర్ల బదిలీ చేసుకోవడానికి అనుమతినిచ్చింది. వామా ఢిల్లీ, హెచ్‌సీఎల్ కార్పొరేషన్లలో శివ్ నాడార్, రోష్నీ నాడార్‌కు ఉన్న 51 శాతం, 10.33 శాతం వాటా బదిలీ మరింత సులభంగా కానున్నది. వామా ఢిల్లీలో రోష్నీ వాటా 44.17 శాతానికి చేరుకోనుండగా, అలాగే హెచ్‌సీఎల్ కార్పొరేషన్‌లో 0.17 శాతం వాటా ఉండనున్నది. నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ నుంచి కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన రోష్నీ.. కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఎంబీఏ పొందారు. జూలై 2020 నుంచి 12 బిలియన్ డాలర్ల విలువైన హెచ్‌సీఎల్ టెక్నాలజీ కంపెనీ చైర్‌పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు, సామాజిక బాధ్యతలో భాగంగా శివ్ నాడార్ ఫౌండేషన్ పేరుతో ప్రారంభించిన సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## అట్టుడుకుతున్న సిరియా

- ప్రతీకార హత్యలతో రెండ్రోజుల్లో 600 మంది మృతి

బీరుట్, మార్చి 8: సిరియాలో రెండు వర్గాల మధ్య ప్రతీకార దాడుల్లో 600 మందికి పైగా మరణించారు. ప్రభుత్వ భద్రతా దళాలు, పదవీచ్యుతుడైన సిరియన్ మాజీ అధ్యక్షుడు బషర్ అసద్ విధేయుల మధ్య రెండు రోజులుగా జరిగిన ప్రతీకార దాడుల్లో భారీగా ప్రాణ నష్టం జరిగింది. 14 ఏండ్ల సిరియా సంక్షోభంలో ఇది భయంకరమైన మారణకాండ అని యుద్ధ నియంత్రణ సంస్థ ఒకటి శనివారం తెలిపింది. అసద్‌ను పదవి నుంచి దించేసి తిరుగుబాటుదారులు అధికారాన్ని చేజిక్కించుకున్న మూడు నెలల తర్వాత డమాస్కస్‌లో ఏర్పడిన ఘర్షణలు నూతన ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. ఈ క్రమంలో ప్రభుత్వ భద్రతా దళాలపై అసద్ విధేయులు శుక్రవారం నుంచి దాడి చేయడం ప్రారంభించారు. ముష్కరులు అలవైట్‌లను ఊచకోత కోశారని స్థానికులు తెలిపారు.

## కర్ణాటకలో ఇద్దరిపై గ్యాంగ్‌రేప్

- వెంట వచ్చిన ముగ్గురు పర్యాటకుల్ని కెనాల్‌లోకి తోసివేత
- ఒకరు దుర్మరణం.. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఘోరం

కొప్పల్, మార్చి 8: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఘోరం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్‌కు చెందిన ఓ పర్యాటకురాలి(27)తోపాటు మరో స్థానిక మహిళపై(29) దుండగులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. కొప్పల్ జిల్లాలో గురువారం రాత్రి ఈ దారుణం జరిగింది. మహిళల వెంట వచ్చిన ముగ్గురు పురుషులను కాల్వలోకి తోసేసి, నేరగాళ్లు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. అమెరికా, మహారాష్ట్రకు చెందిన ఇద్దరు పర్యాటకులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరి ప్రాణాలతో బయటపడగా, ఒడిశాకు చెందిన బిబాశ్ కాలువలో కొట్టుకుపోయి మృతిచెందాడు. శనివారం ఉదయం అతడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బాధితురాలైన స్థానికురాలి కథనం ప్రకారం సనాపూర్ సమీపంలోని తుంగభద్ర లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ వద్ద రాత్రి వేళ తామంతా నక్షత్రాలను వీక్షిస్తుండగా.. బైక్‌పై వచ్చిన దుండగులు మొదట తమకు పెట్రోల్ దొరుకుతుందా అని అడిగారని.. ఆ తర్వాత వంద రూపాయలివ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. అయితే డబ్బులివ్వడానికి తాము నిరాకరించడంతో వారు లైంగిక దాడికి పాల్పడ్డారని తెలిపారు.

## నూకల బియ్యం ఎగుమతిపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ : నూకల బియ్యం ఎగుమతిపై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చిందని విదేశీ వాణిజ్య శాఖ డైరెక్టర్ జనరల్ ఓ నోటిఫికేషన్ ద్వారా తెలిపారు. నిల్వలు పెరుగుతున్నందున ఎగుమతులకు అనుమతించాలని అంతకుముందు ఎగుమతిదారులు ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో ఈ నిషేధాన్ని విధించింది. బాస్మతియేతర బియ్యం ఎగుమతిపై టన్నుకు 490 డాలర్ల కనీస ఎగుమతి ధర నిబంధనను గత ఏడాది ప్రభుత్వం తొలగించింది. ఈ రకం బియ్యం ఎగుమతులపై గంపగుత్తగా విధించిన నిషేధాన్ని ఉపసంహరించింది. ప్రభుత్వ గోదాముల్లో బియ్యం నిల్వలు పుష్కలంగా ఉండటంతోపాటు రిటైల్ ధరలు నియంత్రణలో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయాలు తీసుకుంది.

## ముంబైలో హాలీవుడ్ నటిపై అత్యాచారం

**పెండ్లి చేసుకుంటానని ప్రలోభపెట్టి అఘాయిత్యం**

ముంబై, మార్చి 8 (నమస్తే తెలంగాణ): హిందీ సినిమాలో నటించేందుకు ముంబై వచ్చిన హాలీవుడ్ నటిపై అత్యాచారం జరగడం తీవ్ర సంచలనంగా మారింది. శనివారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు మలాడ్ ప్రాంతంలో నివసిస్తున్నది. ఈ నటిని ఓ వ్యక్తి పెళ్లి చేసుకుంటానని ప్రలోభపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు బంగూర్నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## లిప్‌స్టిక్‌తోపాటు కత్తి, కారం తీసుకెళ్లండి

**మహారాష్ట్ర మంత్రి సూచన**

జలగావ్: మహిళలు తమ పర్సులో లిప్‌స్టిక్‌తోపాటు కత్తి, కారం పొడి వెంట తీసుకెళ్లాలని మహారాష్ట్ర మంత్రి గులాబ్‌రావ్ పాటిల్ సూచించారు. స్వీయ రక్షణ కోసం దీనిని పాటించాలన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న ఘోరాలు, నేరాల తీరును ప్రస్తావించారు. ఇటీవల పుణెలో 26 ఏండ్ల మహిళపై జరిగిన లైంగికదాడిని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు.

## 'ఒక హత్య చేసేందుకు మహిళలకు అనుమతి ఇవ్వండి'

న్యూఢిల్లీ: మహిళా దినోత్సవం సందర్భంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ-ఎస్) మహిళా విభాగం అధ్యక్షురాలు రోహిణి ఏక్‌నాథ్‌రావు ఖడ్సే రాష్ట్రపతి ముర్ముకు ఓ వింత అభ్యర్థన చేశారు. మహిళలపై జరుగుతున్న నేరాల అణచివేతకు ఎలాంటి శిక్ష పడకుండా.. ఒక హత్య చేయడానికి మహిళలకు అనుమతి ఇవ్వాలని కోరారు. రెండు రోజుల క్రితం ముంబైలో ఓ బాలికపై లైంగిక దాడి జరిగిందని.. మానవ మృగాల్లో ఉన్న దుర్మార్గమైన ఆలోచనను అంతమొందించేందుకు తమకు అనుమతి ఇవ్వాలని ఖడ్సే కోరారు.